థ్రిల్లింగ్ కథలు

# అసలు విషయం

**- ఎమ్బీయస్ ప్రసాద్**



"అసలేం జరిగిందో చెప్పు!" అన్నాడు డాక్టరు రఘునాథ్.

"చెప్పానుగా, ఏమీ లేదని. ఎన్నిసార్లడుగుతావ్?" అన్నాడు జగపతి విసుగ్గా.

"చూడు, ఇది జస్ట్ కళ్లు తిరగడమని నువ్వు సింపుల్ గా కొట్టిపారేస్తే కుదరదు. దీనిసంగతి పూర్తిగా తేల్చనిదే నేను నిన్ను ఇంటికి వెళ్లనివ్వను. మీ ఫామిలీ డాక్టర్నే కాదు, చిన్నప్పట్నించీ ఫ్రెండ్‌ని కూడా! అన్ని విషయాలూ తెల్సుకోవాల్సిన బాధ్యత నాకుంది!" అన్నాడు రఘునాథ్ పట్టుదలగా.

"నేను కాదు, నువ్వు రచయితవి కావాల్సింది. లేనిపోనివి ఊహించుకుని నన్ను చంపుతున్నావు. నిన్న ఈవెనింగ్ వాక్‌కు వెళ్లాను. కాస్త దూరం వెళ్లాక కళ్లు తిరిగినట్టనిపించింది. వాంతి అయింది. ఓ మూల వాంతి చేసుకుంటూ ఉంటే మా ఇంటిపక్కనుండే సుందరంగారు చూసి దగ్గరుండి ఇంటికి చేర్చారు. మా ఆవిడ హడావుడి పడితే నీకు ఫోన్ చేశా, నువ్వు వచ్చావు."

"ఇదంతా ఇదివరకే చెప్పావు. నేను తెలుసుకోదలచినది, నిన్న రోజంతా నువ్వు ఏం చేశావు, ఏం తిన్నావు అని!"

"అవన్నీ ఎందుకురా? నిన్న నువ్వే అన్నావు కదా, కథలు రాసి రాసీ టెన్షన్ ఫీలవుతున్నావని. పైగా మొన్న రిలీజైన నవల అంత బాగా అమ్ముడుపోవటంలేదన్న బాధ ఒకటుంది. దానివల్ల."

"అలా అన్నది నిన్న. ఇవాళ నీ టెస్టు రిపోర్టులు వచ్చాయి కాబట్టి ఇంకా డీప్‌గా అడుగుతున్నాను. నోర్మూసుకుని నిన్న జరిగినదంతా తూచా తప్పకుండా చెప్పు!"

"సరే బాబూ, చంపక! వివరంగా చెప్తాను. ప్రొఫెషనల్ రైటర్‌ను కదా! వర్ణన ఎక్కువ కావచ్చు, భరించు! నిన్న పొద్దున కాస్త ఆలస్యంగానే లేచాను. భవాని బజారుకెళదామంది. అక్కడే భోం చేద్దామనుకుని కార్లో బయలుదేరాం. సూపర్ మార్కెట్‌కి వెళ్లి షాపింగ్ కొంత చేసుకుని అక్కడ పాకెట్లు పెట్టి బట్టల దుకాణానికి వెళ్లే దారిలో హోటల్లో దూరాం. అక్కడ రొయ్యల పులుసు బాగా నచ్చి ఎక్స్ట్రాగా తెప్పించాను. స్టమక్ ప్రాబ్లెమ్ అన్నావు చూడు, బహుశా ఆ రొయ్యల్లో!"

"నీ స్వంత తెలివితేటలు ఉపయోగించవద్దు. జరిగినది సాధ్యమైనంత విపులంగా చెప్పు, చాలు!"

"భవాని బట్టల బేరం చేస్తూ ఉంటే నేను పక్కనున్న బార్లోకి వెళ్లి బీరు లాగించాను. ఒకవేళ ... వద్దులే ... నా గెస్ వర్క్ ఎందుకు? తిరిగి వస్తుంటే భవాని కార్లోనే కూర్చుని సూపర్ మార్కెట్లో సామాన్లు పట్టకురమ్మనమంది. అక్కడున్న సేల్స్‌గర్ల్‌కి బుర్ర తక్కువలా ఉంది. అన్నీ ఒకే పేపర్‌బాగ్‌లో వేసి పెట్టింది. నేను బాగ్ ఎత్తేసరికి అది పగిలిపోయి సామాన్లు కింద పడిపోయాయి. గులాబీ మొక్కలకు వేసే పెస్టిసైడ్ పాకెట్ కింద పడి చిరిగిపోతే సణక్కుంటూ ఇంకోటి పట్టుకొచ్చి ఇచ్చింది."

రఘునాథ్ కనుబొమలు ఎగరేశాడు. జగపతి వాక్ప్రవాహానికి అడ్డుకట్ట వేసి, "పెస్టిసైడ్ ఎందుకు కొన్నారు?" అన్నాడు.

"భవాని కొన్నది. అఫ్‌కోర్స్ నేనే కొనమన్నాననుకో, మా ఇంట్లో గులాబీ మొక్కలకి చీడ పడితేనూ..."

"తర్వాత?"

"తర్వాత ఇంటికొచ్చాం. నేను నాలుగురోజుల క్రితం మొదలుపెట్టిన నవల రాస్తూ కూర్చున్నాను. భవాని వంటింట్లో ఏదో సర్దుతోంది. అంతలోనే నాకు ఆమె గురించి ఆలోచన పోయింది. ఈమధ్య మా ఇద్దరిమధ్యా కోల్డ్‌వార్ లాంటిది నడుస్తోందిలే ... నాకెవరితోనో సంబంధం ఉందేమోనని ఆవిడ అనుమానం. ఆమధ్య ఓ సినిమా కంపెనీవాళ్లు ఊటీ తీసుకెళ్లారులే, అక్కడ ఎవత్తినైనా తగులుకున్నానేమోనని ఆవిడకు అనుమాన్నం!"

"నిజంగా ఏదైనా ఉంటే చెప్పు, విని సంతోషిస్తాం. ఆపైన మీ ఆవిడకి నచ్చచెప్పి విడాకులిప్పించేస్తా!"

"చాల్లే! అదేమీ లేదు. పైగా నువ్వు వచ్చి నచ్చచెప్పడం ఒకటి ... అసలీపాటికే గ్రహించి ఉంటావు. నువ్వంటేనే మా ఆవిడకు చికాకు. విడాకులిమ్మని రికమండేషన్ వస్తే చీపురు పట్టుకుంటుంది!" అన్నాడు జగపతి నవ్వు కలుపుతూ.

"తెలుసులేవోయ్! అయినా, ఆవిడతో నాకేమిటీ? భర్త ఫ్రెండ్సంటే ఏ భార్యకు ఇష్టం ఉంటుంది?"

"ఇంతకీ చెప్పొచ్చేదేమంటే, ఆమె ఈమధ్య ఒంటరిగా ఢిల్లీ వెళ్లివచ్చిన దగ్గరనుంచీ నాకు ఆవిడమీద అనుమానం పట్టుకుంది. తన ఉత్తరాలు చూడబోతే పెద్ద గొడవ చేసేస్తోంది. చాలా ముభావంగా ఉంటోంది. ఇదివరకున్న ఆప్యాయత ఏమీ కనబడటంలేదు!"

రఘునాథ్ గంభీరంగా తలూపాడు. "నథింగ్ కెన్ బి రూల్డ్ అవుట్!"

జగపతి కంగారుపడ్డాడు. "నువ్వింక ఆపు! అలాంటిదేమీ లేదుట. చెప్పానుగా, నేను రాసుకుంటూ ఉంటే అదోలా అనిపించింది. లేచి వంటింట్లోకి వెళ్లాను. 'వంటింట్లోకి ఎందుకు వచ్చారు, వెళ్లండి. నాకు పని ఉంది!' అంది భవాని ముభావంగా. తను కాసేపు స్తబ్దంగానే ఉంది కానీ, నేను ఆమె మెడ వంపులో తల దాచుకుని ముద్దాడడంతో ఆమెలో చలనం వచ్చింది. నన్ను దగ్గరికి లాక్కుంది."

"ఇంత వర్ణన అక్కర్లేదులే, నీపై అనుమానాల గురించి ఏమన్నదో అది చెప్పు, చాలు!"

"అదే చెప్పబోతున్నా, ఒకరికొకరం చేరువ కావడంతో అనుమానాలు వాటంతట అవే పటాపంచలు అయిపోయాయి. 'మనిద్దరం ఒట్టి ఫూల్స్! లేనిపోని అనుమానాలతో మన జీవితాలను దుర్భరం చేసుకుంటున్నాం' అంది. 'ఆపాటి ఇంగితం ప్రదర్శించావు, అదే చాలు!' అన్నాను నేను. 'పోనీలెండి, అక్కడకు మీరే పెద్ద తెలివైనవాళ్లు!' అంది. ఆ తర్వాత విషయాలు సెన్సార్ కట్. మొగుడు పెళ్లాం అన్నాక ఇవన్నీ సహజమే, మై డియర్ బాచిలర్ ఫ్రెండ్!" అన్నాడు జగపతి.

"తర్వాత ఏమయింది, అది చెప్పు!" అన్నాడు డాక్టర్ రఘునాథ్ పట్టు



వదలకుండా.

"ఇద్దరం లేచేసరికి సాయంత్రం అయిదయింది. ఆగండి, మీకు సూప్ చేస్తానంటూ లేచి వెళ్లింది. సూప్ బ్రహ్మాండంగా కుదిరింది. అది తాగిన ఓ గంటకు ఈవెనింగ్ వాక్‌కు వెళ్లడం, అక్కడ కళ్లు తిరిగి పడడం జరిగింది!" అంటూ ముగించాడు జగపతి.

డాక్టర్ రఘునాథ్ దీర్ఘాలోచనలో పడిపోయాడు, జవాబు చెప్పకుండా. కాస్సేపటికి తేరుకుని, "సర్లే, నువ్వు ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో, ఆలోచనలు తగ్గించు. ఇంట్లో అంతా చక్కబడిన తర్వాత ఇక టెన్షన్ ఏముంటుంది? మరీ బుర్ర వేడెక్కించే కథలు రాయకు. సరదా కథలు రాయి. పద, ఇంటి దగ్గర దింపుతా!" అన్నాడు చనువుగా భుజం తడుతూ.

డాక్టర్ రఘునాథ్ వెళ్లిపోయిన తర్వాత భవాని అడిగింది, "ఆయన లోపలికి రాలేదేం? నా మీద కోపమా?" అని.

"అబ్బే, అదేం లేదు, బిజీగా ఉన్నట్టున్నాడు!"

"కాదులెండి, నాకు తెలుసు. అదేమిటో ... ఆయన తరహా నాకు నచ్చదు. పోన్లెండి, ఇప్పటినుంచి జాగ్రత్తగా ఉంటాను. ఎంతైనా మీ ఫ్రెండు. పిలవగానే పరిగెత్తుకు వస్తాడు. ఎప్పుడో వీలు చూసుకుని భోజనానికి పిలుద్దాం. అది సరే, ఇంతకీ ఏమన్నాడు?"

"ఏమీ లేదు, అలసట వల్ల కళ్లు తిరిగాయి అన్నాడు!"

"అన్నాడా? నేను చెబుతూనే ఉన్నాను, ఎందుకొచ్చిన తాపత్రయమండీ ఇది? రచయితగా కావలసినంత పేరొచ్చింది. కొత్తవాళ్లతో పోటీపడి రాయడానికి బుర్ర పాడుచేసుకోవడం ఎందుకు? మనకి పిల్లా, పాపా లేరు. మా నాన్న ఇచ్చిపోయిన ఆస్తే బోలెడంత ఉంది. నా పేర ఉంటేనేం, మీ పేర ఉంటేనేం? అనుభవించేది మనిద్దరమే కదా! నా మాట విని కాస్త విశ్రాంతిగా ఉండండి!" అంటూ ఆరాటపడింది భవాని.

అదయిన పదిరోజులకు జగపతి మళ్లీ జబ్బు పడ్డాడు. మేడమీద భవాని నిద్రపోతుండగా రాత్రి పన్నెండు దాటాక ఎటాక్‌లా వచ్చింది. తన స్టడీ రూమ్‌లో ఏదో సీరియల్ రాసుకుంటూండగా తొడల్లో పట్టేసినట్టుగా ఉంటే లేచి నిలబడ్డాడు. పొత్తి కడుపులో మంట. కళ్లు తిరిగినట్టలియి వెంటనే కుర్చీలో కూలబడ్డాడు. రెండు చేతులా పొట్ట పట్టుకోబోయాడు కానీ, తలమీదా, మెడమీదా చెమట్లు పోయడంతో తుడుచుకోబోయాడు. అంతలోనే వాంతి వచ్చే ఫీలింగ్. కుర్చీ ఇటు తిప్పుకుని వేస్ట్ బాస్కెట్‌లోకి భళ్లుమని కక్కుకున్నాడు. అలా ఎంతసేపయిందో తెలియదు.

కాస్సేపటికి తేరుకున్నాడు. నొప్పులు కాస్త తగ్గినట్లనిపించింది. తల ఎత్తబోయాడు. కానీ గదంతా తిరుగుతున్నట్టనిపించింది. గొంతులోంచి సన్నటి ధ్వని రాబోయింది. చేయి అడ్డు పెట్టబోతే నోట్లోంచి రక్తం వేళ్లకంటుకుంది. అప్రయత్నంగా తల టేబుల్ మీదకు వాల్చాడు. అతి కష్టంమీద టెలిఫోన్

అందుకుని డాక్టర్ నంబరు తిప్పగలిగాడు.

డాక్టరు వచ్చి బెల్లు కొట్టేదాకా భవాని లేవలేదు. ఆయనను చూస్తూనే తెల్లబోయింది. "ఏమయింది?" అంటూ.

"మీ ఆయన పరిస్థితి ఏమీ బాగాలేదు. మీకు మాత్రం ఏమీ తెలియనట్టుగా ఉంది!" అన్నాడు రఘునాథ్ పరుషంగా.

"ఆయన నన్ను పిలవనేలేదు. నాకేమీ తెలియదు. ఇంతకీ ఏమయింది?" అంది భవాని నొచ్చుకుంటూ.

డాక్టర్ సమాధానం చెప్పలేదు. విసురుగా జగపతి స్టడీ రూమ్‌లోకి వెళ్లాడు. డాక్టరును చూస్తూనే జగపతి లేచి నిలబడబోయాడు కానీ, తూలి పడిపోయాడు. "నువ్వు కదలక!" అంటూ రఘునాథ్ దగ్గరకెళ్లి అతన్ని పట్టుకుని సోఫాదాకా లాక్కొచ్చాడు. పడుకోబెట్టి భవానికేసి చూశాడు. ఆమె మొహంమీద క్రీము దట్టించి ఉంది. పల్చటి నైట్‌గౌను, ఖరీదైన పెర్‌ఫ్యూమ్. నిద్రమత్తు వదిలిందేమో, కళ్లు విప్పార్చి చూస్తోంది. డాక్టరు తనకేసి చూడటం గమనించి బట్టలు సర్దుకుంటూ ఏదో అడగబోయింది. కానీ డాక్టరు ఆమె కా అవకాశం ఇవ్వలేదు. "కాస్త వేణ్ణీళ్లు, తువ్వాలు, గ్లాసులో మంచినీళ్లు!" అన్నాడు అతి కటువుగా.

డాక్టరుగారు జగపతిని స్పృహలోకి తెచ్చేసరికి గంట పట్టింది. అంతసేపూ భవాని అక్కడే ఉండి సహాయం చేస్తూనే ఉంది. తెల్లవారుజామున మూడు గంటలకు జగపతి మామూలు మనిషయ్యాడనవచ్చు. థాంక్స్ చెప్పబోతూ ఉంటే వారించి, "రేపు పొద్దున హాస్పిటల్‌కి రా, టెస్టులు చేయించాల్సినవి ఉంటే చేయిద్దాం!" అన్నాడు డాక్టరు రఘునాథ్.

డాక్టర్‌ని పంపించి భవాని భర్త వద్దకు వచ్చి దిగాలుగా కూర్చుంది. "భయం వేసిందా, డార్లింగ్!" అన్నాడు జగపతి నీరసంగా నవ్వుతూ.

భవాని నైట్ గౌన్ కొనతో అతని మొహం తుడిచింది. "మళ్లీ దానిగురించి బెంగపెట్టుకోకండి. చెబితే వినరు. ఫోన్ మీ పక్కనే ఉంది కాబట్టి సరిపోయింది కానీ, నాకు తెలియకుండానే అఘాయిత్యం జరిగిపోయేది. ముందు మీకు కావలసినది రెస్టు. వచ్చి పడుకోండి!" అంటూ అతన్ని పడకగదికి తీసుకెళ్లింది.

మర్నాడు పొద్దున ఎనిమిదిన్నరకు డాక్టర్ రఘునాథ్ విజిట్‌కి వచ్చేటప్పటికి జగపతి నిద్రలేచాడు కానీ చాలా అలసటగా ఉన్నాడు. ఇంజెక్షన్ చేయించుకుని ఒళ్లెరగకుండా పడి నిద్రపోయాడు వళ్లీ. మిట్టమధ్యాహ్నానికి మెలకువ వచ్చింది. నీరసం ఉన్నా, మనస్సులో హుషారుగా అనిపించింది. గడ్డం గీసుకుని, స్నానం చేసి బట్టలు వేసుకుంటూండగా భవాని వచ్చింది కిచెన్‌లోంచి.

"మీరు లేచినప్పుడు నన్ను పిలవరేం ఇలాగే ఏదో చేసి కొంపదీస్తారు!" అంటూ చివాట్లేసింది.

"భయపడక! నేను పూర్తిగా రికవర్ అయ్యాను. వెళ్లి ఓ పెగ్ వేసుకొస్తే మళ్లీ మామూలు మనిషినయిపోతాను. నిన్న రాత్రి బకాయి తీర్చేస్తాను!" అన్నాడు జగపతి భవాని బుగ్గ గిల్లుతూ.

"సిగ్గులేకపోతే సరి! అతివృష్టి, అనావృష్టి అంటారు దీన్నే. ఈమధ్యదాకా ఏమైపోయిందో ఈ ప్రేమ?" అంది అలక నటిస్తూ.

"మబ్బు విడిచిన ఎండ ఎలా ఉంటుందో తెలియదా? తెలియకపోతే చూపిస్తా, పట్టు!" అంటూ ఆమెను దగ్గరకు లాగి ముద్దాడబోతుండగా ఫోన్ మోగింది.

"కబుర్లు పెట్టుకు కూచోకండి. భోజనం వడ్డించేస్తున్నాను. చల్లారిపోతుంది!" అంటూ గదిలోంచి వెళ్లిపోయింది భవాని.

"అయితే నిద్ర లేచావన్నమాట! అలాగే శాశ్వతంగా కునికేస్తావనుకున్నాను!" అన్నాడు డాక్టర్ రఘునాథ్ ఫోనులో.

"నువ్వొకడివి అడ్డు పడ్డావుగా! ఇప్పుడు భోజనానికి అడ్డపడ్డావంటే మాత్రం మా ఆవిడ ఊరుకోదు!" అన్నాడు జగపతి వెక్కిరింతగా.

"భోజనం చేయలేదు కదా!" అంటూ ఆదుర్దాపడ్డాడు డాక్టరు.

"ఏం?"


"నేను నిన్ను పరగడుపునే టెస్టె చేయాలి. వెంటనే హాస్పిటల్‌కి రా!"


డాక్టర్ బలవంతం వల్ల వెళ్లక తప్పలేదు. భవాని వరండాలో వెయిట్ చేస్తూండగా డాక్టర్ జగపతి నాలుక, నాడి అన్నీ పరీక్షించాడు. వంగి కాగితంమీద రాసేటప్పుడు, "ఇదిగో జగపతీ! నీ

## కమిట్ మెంట్

తమిళంలో కార్తీక్, అజిత్ ఇప్పుడు చాలా మంచి ఫ్రెండ్స్‌గా ఉంటున్నారుట. అదేమంటే, ఆమధ్య కార్తీక్ హీరోగా నటించిన 'ఉన్నిడత్తిల్ ఎన్నై కొడుత్తేన్' (దీన్నే తెలుగులో 'రాజా'గా తీశారులెండి) సినిమాలో చిన్న గెస్ట్ కారెక్టర్‌ని కార్తీక్ కోరిక మేరకు అజిత్ చేశాడు. ('రాజా'లో అబ్బాస్ పాత్ర అన్నమాట). నిజానికి అజిత్ అక్కడ మంచి మార్కెట్ ఉన్న హీరోనే అయినప్పటికీ, తనకు సీనియర్ అయిన కార్తీక్ మీద అభిమానంతోనే ఈ పాత్రను చేయడానికి అంగీకరించాడు. ఆ విషయాన్ని గుర్తు పెట్టుకున్న కార్తీక్ మాత్రం తక్కువ తిన్నాడా... ఊహుం, తాను బిజీ హీరో అయినా కూడా చూడ కుండా అజిత్ హీరోగా నటిస్తున్న 'ఆనంద పూంగాట్రిల్'లో గెస్ట్ పాత్ర చేయడానికి సిద్ధపడ్డాడు. ఇదేమంటే "ఇది అజిత్ పట్ల నాకున్న బాధ్యతే కాదు, కమిట్‌మెంట్ కూడా!" అన్నాడు. మొత్తానికి హీరోల సంస్కారం బాగానే ఉంది కదూ!

ఎల్.





తాలూకు సామాను ఒకటుంది ఇక్కడ. వెళ్లేటప్పుడు పట్టుకెళ్లు!" అన్నాడు ఓ మూల చూపిస్తూ. అది వేస్ట్ పేపరు బాస్కెట్.

"అదెందుకు తెచ్చావు?" అన్నాడు జగపతి విస్తుపోతూ.

"రచయితవి. ఆమాత్రం ఊహించలేవా? నువ్వు వాంతి చేసుకున్న పదార్థం పరీక్షించాలంటే దాంట్లోనే ఉంది. అది మెటల్‌ది కాబట్టి నా పని సులభం అయింది. మీ ఆవిడ లోపలకి వెళ్లగా చూసి, నా కారులో పెట్టేసుకుని తెచ్చి టెస్ట్ చేశాను."

జగపతి అయోమయంగా చూశాడు. "ఈ మిస్టరీ ఏమిటి? అసలు ని ఉద్దేశ్యం ఏమిటి? ఈ ఇన్వెస్టిగేషన్ ఏమిటి?" అన్నాడు ఆందోళనగా.

"అవన్నీ క్రమంగా నీకే తెలుస్తాయిలే. నిన్న ఏం తిన్నావు, అది చెప్పు ముందు! ఇంట్లోనే తిన్నావా, బయటా?"

"ఇంట్లోనే. రాత్రి కాసేపు ఎక్కువ మేలుకోవాలంటే భవాని సూప్ చేసిచ్చింది. అది ఇచ్చేసి వెళ్లి పడుకుంది. కానీ దానివల్ల ఇంత ఉపద్రవం ...."

"... సూప్ తాగాక ఒక గంటకు నీకు వాంతి వచ్చింది. దాంట్లో చాలాభాగం ఈ బాస్కెట్‌లో ఉంది. ఉన్నదాన్ని ఎనలైజ్ చేసి చూసినదాని ప్రకారం నువ్వు పెద్దమొత్తంలో ఆర్సెనిక్ తీసుకున్నట్టు తెలిసింది!" అన్నాడు డాక్టర్ గంభీరంగా.

జగపతి మొహం పాలిపోయింది. ఆర్సెనిక్ ఎంతటి భయంకరమైన విషమో అతనికి తెలియనిది కాదు. "పెద్దమొత్తంలో కూడా అంటున్నావు. నా పొట్టలోకి ఎలా వచ్చింది? కూరగాలయమీద ఎరువులు స్ప్రే చేస్తున్నారుగా ఈమధ్య ... వాటిల్లో ..."

"అది కాదు. ఇంకో విషయం గుర్తుంచుకో, పదిరోజుల క్రితం కూడా నీపై జరిగినది విషప్రయోగమే. ఈసారి డోస్ ఎక్కువైంది. అంతే తేడా!" కాస్త ఆగి నెమ్మదిగా అన్నాడు డాక్టర్ "రెండుసార్లూ నువ్వు తిన్నది ఇంట్లోనే!"

డాక్టర్ సూచిస్తున్నదేమిటో అర్థం చేసుకోలేనంత మూర్ఖుడు కాదు జగపతి. "నువ్వు చెప్పదలచినది సూటిగా చెప్పు. ఒకవేళ నా భార్యే నన్ను విషప్రయోగంతో చంపుదామని చూస్తోందని అన్నావో, నీ నాలిక పీకేస్తాను! మధ్యలో కాస్త కలతలు వచ్చాయన్నమాట నిజమే. ఆమెకు నా మీద అనుమానం వచ్చిందన్నమాటా నిజమే. కానీ నన్ను చంపేటంత నీచురాలు కాదామె. నువ్వంటే ఇష్టం లేదు కదాని ఆమెమీద అభాండాలు మొదలెడితే జన్మలో నీ మొహం చూడను! అంతేకాదు, ఈ విషయం నువ్వు పోలీసులకు చెప్పే సాహసం చేస్తే నిన్ను చంపడానికి కూడా వెరవను. అసలు ఆర్సెనిక్ ఎక్కడ దొరుకుతుంది భవానికి?"

"మీ ఇంట్లో చూశాను. గులాబీ మొక్కల ఎరువు."

"కొన్నది తనే కావచ్చు, కానీ తెమ్మన్నది నేను!" అంటూ అరిచాడు జగపతి.

"నువ్వొకందుకు తెమ్మంటే, ఆమె మరొకందుకు తెచ్చి ఉండవచ్చు!" అన్నాడు డాక్టర్ నిర్లిప్తంగా.

జగపతికి వెర్రి కోపం వచ్చింది. ఛీత్కారంగా డాక్టర్‌కేసి చూసి, "నీ మొహం చూస్తేనే పాపం!" అంటూ వచ్చేశాడు.

కానీ డాక్టర్ మొహం చూడాల్సివచ్చింది జగపతికి పదిహేను రోజులు తిరక్కుండానే. అతను, సుందరంగారూ ఈవెనింగ్ వాక్‌నుండి తిరిగి వచ్చేసరికి భవాని హాల్లో నేలమీద పడి ఉంది, కదలకుండా మెదలకుండా. నాడి అందటంలేదు. ఇక గత్యంతరం లేక డాక్టర్ రఘునాథ్‌ని పిలవవలసి వచ్చింది.

డాక్టర్ వచ్చి పెదవి విరవడంతోబాటు టీపాయ్‌మీద ఉన్న కాఫీ కప్పుల్లో అడుగున ఉన్న పదార్థాన్ని పరీక్షించాడు. "వాక్‌కి వెళ్లబోయే ముందు మీ ఇద్దరూ తాగినది వీటిల్లోనే కదూ! ఒకదాంట్లో విషం ఉంది. మరొదాంట్లో లేదు. నీ భార్య నీ మీద మళ్లీ విషప్రయోగం చేయబోయింది. కానీ పాపం, చివరిక్షణంలో పొరబాటు పడింది. కాఫీ తాగబోతూంటే ఎవరైనా వచ్చారా?"

"అవును. సుందరంగారు పిలిచారు."

"ఆ హడావుడిలో మంచి కప్పు నీకిచ్చి, విషం కప్పు అనుకోకుండా తను తాగేసింది. గంటయ్యేసరికి ప్రాణాలమీదకు వచ్చింది. నువ్వు ఇంట్లో లేవు కాబట్టి.కాపాడేవారు లేరు. తను చేసిన పనికి దేముడు సరైన శిక్ష విధించాడు!"

జగపతికి పట్టరాని దుఃఖం వచ్చేసింది. డాక్టరును పట్టుకుని ఏడ్చాడు. "నిన్ను అనుమానించినందుకు క్షమించు. భవాని ఇలాంటిదని కలలో కూడా అనుకోలేదు. ఇప్పుడు నా పరువు తీసేసింది. ఇదంతా పేపర్లో వస్తే ...."

"నువ్వు దానిగురించి భయపడక. లాస్ట్ టైమ్ విషప్రయోగం జరిగినప్పుడే నువ్వు వద్దన్నా, నేను పోలీస్ సూపరింటెడెంట్ ఒకాయనకు చెప్పాను, ఇదీ సంగతని. హెచ్చరించాను కూడా, నీకేదైనా జరిగితే ఆమెను గట్టిగా అడగమని. చివరికి తను తీసుకున్న గోతిలో ఆమే పడింది. నీ పరిస్థితి అర్థం చేసుకుంటాడాయన. కేసూ, గీసూ లేకుండా చూస్తాడు. నేనూ నాచురల్ డెత్ అని రాసి ఇచ్చేస్తాను!" అన్నాడు డాక్టర్ సానుభూతిగా.

జగపతి అతన్ని పట్టుకుని ఏడ్చాడు.

♦♦♦

మూడువారాల తర్వాతగానీ అతని మొహంమీద చిరునవ్వు మొలవలేదు. అదీ ఊటీలో జూనియర్ తార కుమారి అతన్ని అల్లుకుపోతూ "ఇప్పటినుంచి నాచేత కథలు రాయించండి. మీ ఆవిణ్ణి అడ్డు తొలగించుకుని ఆవిడ ఆస్తిని, నా అందాన్ని ఎలా కొల్లగొట్టాలో బ్రహ్మాండమైన ఐడియా చెప్పినది నేనేగా!" అన్నప్పుడు.

"ఐడియా చెప్పడానికేంలే, రెండోసారి డోస్ ఎక్కువైపోయింది. కాస్త ఉంటే నీ కౌగిలిలో కాదు, స్వర్గంలో రంభ కౌగిలిలో తేలేవాణ్ణి!" అన్నాడు జగపతి కుమారిని ఆక్రమిస్తూ. ♦



## ఆవిడెవరో?

ఒకప్పుడు మనోజ్ బాజ్‌పాయి అంటే ఎవరో జనానికి తెలీదు. కాని 'సత్య' చిత్రం పుణ్యమాని ఒక్కసారిగా వెలుగులోకి వచ్చేశాడు. అంతకు ముందు దూరదర్శన్లో సీరియల్‌గా వచ్చిన 'స్వాభిమాన్'లో తన చక్కని నటనతో అందరినీ ఆకట్టుకున్నాడు మనోజ్. మరిచిపోలేనిదేదైనా సంఘటన గురించి చెప్పమంటే " తొలి రోజుల్లో నా స్నేహితుడొకడు సినిమా తీయాలని ఓ నటి దగ్గరికి వెళ్లి అడిగితే, ఆమె అతనిలో సెక్సప్పీలే లేదని యింకొకరి పేరు సూచించింది. నేనైతే ఆమె నా లుక్స్, పర్సనాలిటీ బాగోలేవని విమర్శించటంతో చాలా బాధ పడ్డాను. కాని యీ రోజు ఆవిడే నన్ను, మనోజ్ ఓ అద్భుతనటుడని పొగుడుతూ, తనకు నన్ను చూస్తే గర్వంగా వుందనీ అంటూంది. మనిషికి కావలసింది సక్సెస్ మాత్రమే. దాన్ని బట్టే మనుషుల మీదుండే అభిప్రాయాల్లో మార్పులు వస్తుంటాయి" అన్నాడు. అంతా నిజమే కాని ఇంతకూ ఆ మాటలన్న ఆ నటి పేరు మాత్రం మనోజ్ చెప్పనేలేదు! చెప్తే బాగుండేది కదా!